క్లుప్తంగా

అయ్యప్ప సేవకు మోహిత్‌రెడ్డి



ఇరుముడితో బయలుదేరుతున్న మోహిత్‌రెడ్డి, పక్కన చెవిరెడ్డి దంపతులు

తిరుపతి రూరల్ : వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సోమవారం శబరిమలై యాత్రకు బయలుదేరారు. ఈ సందర్భంగా తుమ్మలగుంటలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఇరుముడు కట్టుకున్నారు. తల్లిదండ్రుల సమక్షంలో విశేష పూజలు నిర్వహించి అయప్ప దర్శనానికి తరలివెళ్లారు.

శెట్టిపల్లె భూములపై విచారణ



అధికారులకు ఆదేశాలిస్తున్న ఆర్డీఓ రామ్మోహన్

తిరుపతి అర్బన్ : శెట్టిపల్లెలోని భూ సమస్యల పరిష్కారానికి సోమవారం తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలో బహిరంగ విచారణ ప్రారంభించారు. ఈ నెల 4వ తేదీ వరకు కొనసాగనున్న విచారణలో ప్రతి అర్జీ, భూ హక్కు పత్రాలను స్వీకరించాలని ఆర్డీఓ రామ్మోహన్ ఆదేశించారు. ఈ క్రమంలో తహసీల్దార్ కేపీ భాగ్యలక్ష్మి పర్యవేక్షణలో డీటీలు అశోక్‌రెడ్డి, రామచంద్ర, కిరణ్ అర్జీలు, భూ హక్కు పత్రాలు తీసుకున్నారు. తొలిరోజు సర్వే నంబర్ 428 నుంచి 474 వరకు వ్యవసాయ భూములకు సంబంధించి 52 మంది అర్జీలు, పత్రాలు అందించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మంగళవారం 387 నుంచి 408 సర్వే నంబర్ వరకు, బుధవారం 409 నుంచి 427 తోపాటు 475 సర్వే నంబర్ పరిధిలోని వారు అర్జీలు, భూహక్కు పత్రాలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్ఓలు సుమన్, ప్రసాద్ పాల్గొన్నారు.

4న ప్రజా హక్కుల సభ

చంద్రగిరి : సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చని కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఈ నెల 4వ తేదీన విజయవాడలో ప్రజా హక్కుల సభ నిర్వహించనున్నట్లు సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ నేతలు తెలిపారు. సోమవారం చంద్రగిరిలో సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నేతలు మాట్లాడుతూ ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకు సీఎం చంద్రబాబు యత్నిస్తున్నారని ఆరోపించారు. అందుకే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను ఎందుకు ప్రశ్నించడం లేదని మండిపడ్డారు. ప్రజా హక్కుల సభకు పెద్దసంఖ్యలో జనం తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి సత్తార్, సభ్యులు బాబు నాయక్, వెంకట్రమణ నాయక్, వెంకటేష్, మునస్వామి, వెంకటేష్, లలిత పాల్గొన్నారు.

'మాతృశ్య'లో అన్నదానం



భోజనం ప్యాకెట్‌లు అందిస్తున్న దాత

తిరుపతి అర్బన్ : మాతృశ్య ఆశ్రమంలోని బాల బాలికలు, వృద్ధులకు సోమవారం జిత్తు జ్యువెలరీస్ నిర్వాహకులు జితేంద్ర అన్నదానం చేశారు. అలాగే పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, జామెంట్రీ బాక్సులు అందించారు. జితేంద్ర మాట్లాడుతూ సేవాభావంతో పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రజా సాధికారిక ట్రస్ట్ నిర్వాహకుడు బాలాజీ, ఆశ్రమం అధ్యక్షులు శ్రీదేవి పాల్గొన్నారు.

ఫ్యాషన్ షో విజేతలకు అభినందన



విజేతలను అభినందిస్తున్న ఎమ్మెల్సీ సిపాయి

తిరుపతి తుడా : స్థానిక సహారా స్కూల్ ఆఫ్ డిజైన్ ఆధ్వర్యంలో సోమవారం వివాహ భోజనంబు ఫంక్షన్ హాల్‌లో అట్టహాసంగా ఫ్యాషన్ షో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం హాజరై విజేతలను అభినందించారు. బహుమతులు, సర్టిఫికెట్‌లు అందించారు.

అగ్రికల్చర్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

తిరుపతి సిటీ: ఆచార్య ఎన్జీరంగా వర్సిటీ అంతర వ్యవసాయ కళాశాలల క్రీడా, సాంస్కృతిక పోటీలు–2024లో తిరుపతి ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. రాష్ట్ర స్థాయిలో మూడు విడతల్లో క్రీడా పోటీలు నిర్వహించారు. ఇందులో ఎస్వీ వ్యవసాయ కళాశాల విద్యార్థుల జట్టు బాస్కెట్ బాల్, టేబుల్ టెన్నిస్ విభాగాల్లో విజేతగా నిలిచింది. చెస్, లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం, హై జంప్‌లో తృతీయ స్థానం దక్కించుకుంది. ఫుట్ బాల్ విజేతగా, 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం, 200 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానం, 100 మీటర్ల రిలేలో తృతీయ స్థానంలో నిలిచింది.








వసంత వైభవం

తిరుచానూరు పద్మావతీదేవి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి వైభవంగా వసంతోత్సవం నిర్వహించారు. సర్వాలంకారభూషితులైన సిరులతల్లిని తిరుచ్చిపై కొలువుదీర్చి ఊరేగించారు. కనులపండువగా తీర్చిదిద్దిన పల్లకీపై అలమేలు మంగమ్మ ఆశీనులై మాడవీధుల్లో విహరించారు. అత్యంత ప్రీతిపాత్రమైన గజవాహనం అధిరోహించిన శ్రీమహాలక్ష్మిని వీక్షించిన జనులు భక్తిపారవశ్యంతో తన్మయత్వం చెందారు. ఈ క్రమంలోనే ఆకాశరాజపుత్రికను ప్రసన్నం చేసుకునేందుకు శ్రీమద్ రామానుజ కైంకర్య ట్రస్ట్ ప్రతినిధులు పవిత్ర గొడుగులను కానుకగా సమర్పించారు. వాహనసేవలను కనువిందు చేస్తూ వివిధ వేషధారణల్లో కళాకారులు అద్భుత ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

- చంద్రగిరి



మనోధైర్యం.. ఓడిన వైకల్యం

- అత్యుత్తమంగా రాణిస్తున్న దివ్యాంగులు
- ఎందరికో స్ఫూర్తినిస్తూ ఉన్నతంగా అడుగులు
- ఆదర్శవంతంగా జీవనం సాగిస్తున్న మహిళామణులు
- నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

శాపగ్రస్తులుగా అవమానాలు ఎదుర్కొన్నారు. విధి వంచితులుగా సానుభూతి మాటలను భరించారు. అంగవైకల్యంతో బాధపడుతూ సమాజంలో చిన్నచూపుకు గురయ్యారు. బంధుమిత్రులతోపాటు కుటుంబీకుల హేళనలను సైతం దిగమింగుకున్నారు. దివ్యాంగులుగా పుట్టినా మొక్కవోని దీక్షతో నిలబడ్డారు. ఆత్మవిశ్వాసంతో పరిస్థితులను తమకు అనుకూలంగా మలుచుకున్నారు. జీవితం నేర్పిన పాఠాలనే సోపానాలుగా మార్చుకుంటూ ఉన్నతంగా చదువుకున్నారు. బలహీనతగా భావించిన వైకల్యాన్ని మనోధైర్యంతో ఓడించారు. ఎందరికో స్ఫూర్తిని అందిస్తూ సగర్వంగా సమాజానికి దిశానిర్దేశం చేస్తున్నారు. నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ×సాక్షి≤ ప్రత్యేక కథనం.

- తిరుపతి సిటీ

ఎవరికైనా ఇచ్చేయమన్నారు



మాది శ్రీకాకుళం. తల్లిదండ్రులు వ్యసాయ కూలీలు. మేము నలుగురు అక్కాచెల్లెళ్లం. నేను రెండో సంతానం. చిన్ననాటి నుంచి ఆర్థిక సమస్యలే. పోలియోతో జన్మించా. నడవలేని పరిస్థితి. ఎన్నో ఛీత్కారాలను ఎదుర్కొన్నా. కాళ్లు లేని ఈ అమ్మాయిని ఎవరికైనా ఇచ్చేయమని బంధువులు అన్నారు. అయితే అమ్మ నన్ను అక్కున చేర్చుకుంది. కూలి పని చేసి చదివించింది. నేను కూడా అహర్నిశలు శ్రమించి పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేశా. 2004లో మహిళా వర్సిటీలో అధ్యాపకురాలిగా చేరా. ఇక వెనుతిరిగి చూడలేదు. నేను వివాహం చేసుకోలేదు కానీ, కుటుంబ బాధ్యతలు తీసుకుని మా అక్కాచెల్లెళ్ల పిల్లలను చూసుకున్నా. వారికి అండగా నిలిచి మంచి భవిష్యత్ ఇచ్చా. అలాగే నా విద్యార్థులు ఉన్నతంగా ఎదిగేలా కృషి చేశా. ప్రస్తుతం చాలామంది నా విద్యార్థులు అత్యున్నతస్థాయిలో ఉద్యోగాలు చేస్తున్నారు.

- ప్రొఫెసర్ తవితా తులసి, హెచ్‌ఓడీ, సోషల్ వర్క్ విభాగం, మహిళా వర్సిటీ

బయటకు గెంటేశారు



మాది అనంతపురం. పోలియో కారణంగా పుట్టుకతోనే నాకు రెండు కాళ్లు పని చేయవు. దీంతో నన్ను, అమ్మను బంధువులతో కలిసి మా నాన్న బయటకు గెంటేశారు. 1999లో తిరుపతికి చేరుకున్నాం. అమ్మ ఇళ్లలో పనిచేస్తూ నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదివించింది. ఇంటర్, డిగ్రీ తిరుపతిలోని టీటీడీ కళాశాలలో పూర్తి చేసి పీజీ ఎస్వీయూలో చదివా. తిరుపతిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తూ నెట్ క్వాలిఫై అయ్యాను. ప్రస్తుతం చెన్నైలో పేరొందిన ఎస్ఆర్‌ఎమ్ యూనివర్సిటీలో ఇంగ్లిషు ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నా. తిరుపతిలో సొంత బిల్డింగ్ కట్టుకున్నా. వివాహమైంది. మా బాబు డాక్టరుగా పనిచేస్తున్నాడు. కొన్నేళ్ల తర్వాత అనారోగ్యంతో మా నాన్న కాపాడు తల్లీ అంటూ నా దగ్గరకే వచ్చాడు. వృద్ధుడైన తండ్రిని నేనే చూసుకుంటున్నా. దివ్యాంగులు ఎప్పుడూ సానుభూతి కోసం ఎదురుచూడకూడదు. పట్టుదలతో సత్తా చూపి సమాజంలో నిలబడాలి.

- ప్రొఫెసర్ ప్రసన్న కుమారి, ఎస్ఆర్ఎమ్ వర్సిటీ

ఆశయమే ఊపిరిగా..



మాది తిరుపతి. పోలియో కారణంగా పుట్టుకతోనే అంగవైకల్యం. అప్పట్లోనే చెన్నై, బెంగళూరులోని ఆస్పత్రుల్లో చూపించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో వైకల్యాన్ని ఎదుర్కొని పోరాడాల్సి వచ్చింది. తల్లిదండ్రుల సహకారం మరువలేనిది. ప్రతి విషయంలోనూ వెన్నుతట్టి ప్రోత్సహించేవారు. ఉన్నత చదువులు చదవాలనే ఏకైక లక్ష్యం పెట్టుకున్నా. ఆశయమే ఊపిరిగా శ్రమించి పీజీ, పీహెచ్‌డీ, స్పెషల్ బీఈడీ పూర్తి చేసి ఎస్వీ హైస్కూల్‌లో టీచర్‌గా ప్రస్థానం ప్రారంభించా. అంచెలంచెలుగా రాణిస్తూ జూనియర్ కళాశాలలోనూ పనిచేసి, ప్రస్తుతం పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో కామర్స్ విభాగం అధ్యాపకురాలిగా విధులు నిర్వర్తిస్తున్నా. ఇద్దరు పిల్లలు. ఒకరు అమెరికాలో, మరొకరు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. కుటుంబ బాధ్యతలతో పాటు ఎంతో మంది విద్యార్థినులను అధికారులుగా, సమాజసేవకులుగా, బ్యాంకు ఉద్యోగులుగా తీర్చిదిద్దా.

- డాక్టర్ టి.సునీత, అధ్యాపకులు, పద్మావతి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల

ఆత్మవిశ్వాసంతో నిలబడ్డా



మాది తిరుపతి రూరల్ మండలం. తల్లిదండ్రులు భవన నిర్మాణ కూలీలు. మా అన్న, నేను, తమ్ముడు ముగ్గురు సంతానం. పోలియోతో పుట్టుకతోనే కాళ్లు పని చేయలేదు. ఇంటికే పరిమితం చేశారు. ప్రభుత్వ పాఠశాలకు అమ్మ రోజూ మోసుకుని తీసుకెళ్లేది. డిగ్రీ వరకు తిరుపతిలో చదివా. హైదరాబాదు ఉస్మానియా వర్సిటీలో ఎంబీఏ,, పీహెచ్‌డీ పూర్తి చేశా. అన్న, తమ్ముడిని ఉన్నత స్థాయిలో చూడాలనే ఉద్దేశంతో శ్రమించి టోఫెల్ పరీక్షలో నెగ్గి సుమారు 8ఏళ్లు అమెరికా, లండన్‌లో హెచ్‌ఆర్ మేనేజర్‌గా పనిచేశా. అమ్మ, నాన్న కోరక మేరకు వారికి మంచి ఇల్లు నిర్మించి ఇచ్చా. అన్నకు నేనే దగ్గరుండి పెళ్లి చేశా. తమ్ముడు విదేశాలలో ఉద్యోగం చేస్తున్నాడు. నేను ప్రస్తుతం హైదరాబాదులోని ఓ ప్రైవేటు కంపెనీలో హెచ్‌ఆర్ మేనేజర్‌గా పనిచేస్తున్నా. అంగవైకల్యం ఉన్నవారిలో సాధారణ వ్యక్తుల కంటే పది రెట్లు ఆత్మవిశ్వాసం ఉంటుంది. అదే పెట్టుబడిగా సమాజంలో నిలబడ్డా.

- డాక్టర్ ప్రమీల, హెచ్‌ఆర్ మేనేజర్

గరళకంఠునికి ఘటాభిషేకం



విశేషాలంకరణలో స్వామివారు

చంద్రగిరి : తొండవాడ సమీపంలోని స్వర్ణముఖీనది ఒడ్డున వెలసిన శ్రీఅగస్త్యేశ్వరస్వామి వారి ఆలయంలో తమిళ కార్తీక సోమవారం సందర్భంగా సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేపట్టారు. అలాగే ఆర్ఎఫ్ రోడ్డులోని శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయం(పుట్టాలమ్మ)లో అర్చకుడు శివకుమార్ శర్మ విశేష పూజలు చేశారు.

'మలబార్'లో ఆభరణాల ప్రదర్శన



ప్రదర్శన ప్రారంభిస్తున్న మహిళలు

తిరుపతి కల్చరల్ : బాలాజీ కాలనీలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌లో బ్రాండెడ్ ఆభరణాలను ప్రదర్శనను సోమవారం ప్రారంభించారు. షోరూమ్ హెడ్ రెజీష్ మాట్లాడుతూ వినియోగదారుల సౌకర్యార్థం అద్వితీయ మైన బ్రాండెడ్ ఆభరణాలను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 8వ తేదీ వరకు ప్రదర్శన ఉంటుందని, బంగారు ఆభరణాలు, జెమ్ స్టోన్, అన్‌కట్ నగల తరుగు చార్జీలు, వజ్రాల విలువపై 25 శాతం వరకు తగ్గింపు ఉంటుందని వివరించారు.

కమనీయం.. కళా వైభవం



కళాకారుల నృత్య ప్రదర్శన

తిరుపతి కల్చరల్ : పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వివిధ కళా వేదికలపై కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను రంజింపజేశాయి. టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో తిరుపతిలోని మహతి, అన్నమాచార్య కళా మందిరం, శ్రీరామచంద్రపుష్కరిణి, శిల్పారామం, తిరుచానూరులోని ఆస్థాన మండపంలో ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలు చేపట్టారు. మహతిలో ఢిల్లీకి చెందిన పద్మశ్రీ కనకా శ్రీనివాసన్ ప్రదర్శించిన భరతనాట్యం ఆకట్టుకుంది. అన్నమాచార్య కళామందిరంలో విజయవాడకు చెందిన హర్షిత రాధారాణి బృందం ప్రదర్శించిన భక్తి సంగీత గానామృతం శ్రోతల హృదయాలను ఓలలాడించింది. శ్రీరామచంద్ర పుష్కరిణి వేదికపై డాక్టర్ జె. శ్రీలలిత ,హోసూర్‌కు చెందిన శ్రీకృష్ణ బృందం ఆలపించిన సంకీర్తనలు భక్తులను అలరించాయి. తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో వైష్ణవి కళా బృందం ప్రదర్శించిన నృత్యాభినయం కనువిందు చేసింది. తిరుచానూరులోని ఆస్థాన మండలంలో ఎస్వీ సంగీత, నృత్య కళాశాల మంగళధ్వని, ఎస్వీ ఉన్నత వేద అధ్యయన సంస్థ పండితులచే చేపట్టిన చతుర్వేద పారాయణం భక్తి పరవశం నింపింది. డాక్టర్ రాఘవాచార్యులు చేపట్టిన శ్రీసూక్త వ్యాఖ్యానం ఆకట్టుకుంది. బెంగుళూరుకు చెందిన రంగనాథ్ బృందం గాత్ర కచేరి, సావిత్రి, జయంతి బృంద హరికథాపారాయణం అలరించింది.

7న పేరెంట్, టీచర్స్ మీటింగ్



మాట్లాడుతున్న ఎంఈఓ బాబ్జీ

పాకాల : పేరెంట్, టీచర్స్ మీటింగ్‌ను ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంఈఓ బాబ్జీ తెలిపారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీలో హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ మండలంలోని 69 ప్రభుత్వ పాఠశాలల్లో రాజకీయాలకు అతీతంగా మీటింగ్ జరపించాలని సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేయాలన్నారు. సమావేశంలో హెచ్‌ఎంలు నాగరాజా, మహమ్మద్‌రఫీ, చౌదరి, మోహన్ పాల్గొన్నారు.

ఐఎంఏ అధ్యక్షుడికి సత్కారం



ఆర్ఆర్ రెడ్డిని సత్కరిస్తున్న ప్రవీణ్, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్ : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడుగా ప్రమాణస్వీకారం చేసిన డాక్టర్ ఆర్ఆర్ రెడ్డిని బాలాజీ నర్సింగ్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్ చైర్మన్ ఎలమంచిలి ప్రవీణ్ సోమవారం ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆర్ఆర్ రెడ్డి సేవాభావంతో సమాజ హితం కోసం కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, పార్థసారథి, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నందకిషోర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్యామ్‌బాబు పాల్గొన్నారు.

నైతిక విలువలు తప్పనిసరి

పాకాల : ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నైతిక విలువ పాటిస్తే ఎయిడ్స్‌ను సమాజం నుంచి దూరం చేయవచ్చని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి మునిరాజా తెలిపారు. సోమవారం ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. విద్యార్థులతోపాటు అధ్యాపకులు హరినాథ్‌ఆచ్చారి, జయచంద్ర, బాలు, చలమారెడ్డి, గిరిజ పాల్గొన్నారు.


గ్రీవెన్స్‌కు 25 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు వివిధ సమస్యలపై 25 వినతులు వచ్చినట్లు కార్పొరేషన్ కమిషనర్ మౌర్య తెలిపారు. ప్రధానంగా డిడ్కో ఇళ్ల వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్‌లో స్టాల్స్ ఏర్పాటు చేయడంతో పిల్లలు ఆడుకునేందుకు ఇబ్బందిగా ఉందని, టీడీఆర్ బాండ్లు ఇప్పించాలని, గతంలో ఇళ్ల కోసం కట్టిన నగదు తిరిగి ఇప్పించాలని, శ్రీవారి నగర్ లో విద్యుత్ దీపాలు వెలగలేదని, కాలువలు, రోడ్లు శుభ్రం చేయాలని, కుక్కల బెడద నివారించాలని తదితర సమస్యలతో ప్రజలు అర్జీలు సమర్పించినట్లు వివరించారు. ఆయా వినతులను సంబంధిత విభాగాల అధికారులు పరిశీలించిన వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, ఎంఈలు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, రవి, సెక్రటరీ రాధిక, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి, మేనేజర్ హసీమ్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

తిరుపతి సిటీ : ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించే వ్యాస రచన, వక్తృత్వ పోటీల పోస్టర్‌ను సోమవారం వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పిస్తున్న మానవ హక్కుల ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని, హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలను పాఠశాల స్థాయి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆచార్య సుధారాణి, కల్చరల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, అధ్యాపకులు డాక్టర్ గట్టు రంజిత్ కుమార్, డాక్టర్ రవిబాబు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణ..



ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవం సందర్భంగా ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లు సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎయిడ్స్ నివారణకు ప్రజలను చైతన్యవంతం చేయాలని విద్యార్థులకు సూచించారు. వైస్ ప్రిన్సిపల్ పి.భాస్కరుడు, అధ్యాపకులు వి.చలపతి, మునీంద్రన్, ఎన్‌సీసీ అధికారులు వి.రమేష్, ఏ.ఉమామహేశ్వరి, డాక్టర్ కె.పురుషోత్తమనాయుడు పాల్గొన్నారు. - తిరుపతి సిటీ



ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవం నిర్వహించారు. సోమవారం ఈ మేరకు చేపట్టిన ర్యాలీని ప్రిన్సిపల్ డాక్టర్ బి.సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపల్ పరమేశ్వర, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు పి.శివకుమార్, బి.సులోచనారాణి పాల్గొన్నారు. - తిరుపతి సిటీ

కాలుష్య నివారణ..



స్విమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. స్విమ్స్ డైరెక్టర్, వీసీ ఆర్‌వీ కుమార్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. డైరెక్టర్ మాట్లాడుతూ భోపాల్ గ్యాస్ విపత్తులో ప్రాణాలు కోల్పోయిన వారి జ్ఞాపకార్థం జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం జరుపుకుంటున్నట్లు వెల్లడించారు. స్వచ్ఛమైన గాలి, పచ్చని భూమి, సుస్థిర జీవనం వైపు ఒక అడుగు అనే ఈ థీమ్‌తో ప్రతి ఒక్కరూ ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. డాక్టర్ నాగరాజ్, డాక్టర్ ఉషాకళావత్, డాక్టర్ రామ్, డాక్టర్ కోటిరెడ్డి, మధుబాబు, మాధవి, కళావత్ పాల్గొన్నారు. - తిరుపతి తుడా